ఘనంగా మాతృ దినోత్సవం



కిర్లంపూడిలో మాతృ దినోత్సవంలో పాల్గొన్న చిన్నారుల తల్లులు

తుని రూరల్: మాతృ దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ తుని ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లికి వందనం కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మాజీపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు చిన్నారులు పాదపూజ చేశారు. తల్లులు చిన్నారులను ఆశీర్వదించారు. మాతృత్వం విశిష్టత, తల్లుల పాత్ర, చిన్నారుల భవిష్యత్‌పై అంగన్‌వాడీలు తల్లులు, కిషోర బాలికలు, చిన్నారులకు అవగాహన కల్పించారు. పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, అంగన్‌వాడీల్లో అందించే పౌష్టికాహారంతో పాటు అదనపు ఆహారాన్ని అందించాలన్నారు. కంటికి రెప్పలా చిన్నారులను సాకాలన్నారు. గర్భిణులు, కిషోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం లక్ష్యాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భిణులు, కిషోరబాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లికి వందనం

కిర్లంపూడి: జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమాలు నిర్వహించారు. కిర్లంపూడి-1 అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు తమ తల్లులతో మొక్కలు నాటించారు. చిన్నారులు తల్లులకు పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సీహెచ్ రత్నం, బి.సూర్యావతి, సీహెచ్ రాణి, పి.ప్రభావతి, పి.మంగయమ్మ, జి.గంగాభవాని, ఎం. నూకరత్నం, ఎస్‌కే హసీనాభేగం తదితరులు పాల్గొన్నారు.



అమ్మాజీపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

విజయీభవ !

సైనిక విజయం కాంక్షిస్తూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఏలేశ్వరం: పాకిస్థాన్‌పై కొనసాగుతున్న పోరాటంలో భారత సైన్యం విజయం సాధించాలని కోరుతూ పట్టణంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ వద్ద వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ పహల్గాంలో 26 మందిని అన్యాయంగా పొట్టనబెట్టుకున్న దాయాది పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పోరులో మన దేశం విజయకేతనం ఎగుర వేయాలని ప్రత్యేక పూజలు చేశామన్నారు. దేశప్రజలంతా సైన్యానికి బాసటగా నిలవాలన్నారు. రాబోయే రోజుల్లో ఇండియా వైపు చూడాలంటే భయపడేలా పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పైల విజయకుమార్, కోరాడ ప్రసాద్, కావలి శ్రీనివాసరావు, రెడ్డి బాబులు, సామంతుల శ్రీనివాసరావు, చందక కిరణ్, గోళ్ల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధంలో విజయం కాంక్షిస్తూ హోమం

గోకవరం: ఆపరేషన్ సిందూర్‌లో భారత్ విజయం సాధించాలని కాంక్షిస్తూ గోకవరం మెయిన్‌రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం హోమం నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర, సీనియర్ నాయకుడు ఉంగరాల ఆదివిష్ణు మాట్లాడుతూ యుద్ధం అనేది ఆట కాదని, ఏ దేశం కూడా యుద్ధం కోరుకోదన్నారు. ముఖ్యంగా భారతదేశం శక్తివంతమైన దేశం అయినప్పటికీ శాంతియూత దేశమన్నారు. సైనిక చర్యల్లో భారత్ కచ్చితంగా విజయం సాధిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రంలో బీజేపీ ఏపీ స్టేట్ కాన్సిల్ సభ్యుడు సత్తి వెంకటరెడ్డి, ఆలయ ధర్మకర్త బత్తుల వెంకన్నబాబు, నియోజకవర్గ కో కన్వీనర్ కోనా సురేష్, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి ముప్పిడి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సూర్య కుమార్, తదితరులు

శరీర దృఢత్వానికి ఎన్‌సీసీ దోహదం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

గండేపల్లి: శారీరక దృఢత్వానికి ఎన్‌సీసీ క్యాంపు దోహదపడుతుందని 3వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ హెచ్‌ఎస్ మాణిక్ పేర్కొన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఎన్‌సీసీ 1వ కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సామాజిక సేవ, శారీరక దృఢత్వం పెంపొందించుకోవడానికి ఎన్‌సీసీ క్యాంపులు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ హెచ్‌క్యూ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, ఆదిత్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎస్.సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తుని: స్థానిక కత్రాళ్లకొండ వద్ద పాయకరావుపేట నుంచి తుని మండలం కుమ్మరిలోవకు సారా తలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని ఎక్సైజ్ సీఐ పట్టాభి చౌదరి శనివారం తెలిపారు. పాయకరావుపేట అంబేడ్కర్ కాలనీకి చెందిన ఇంజరపు సింహాచలం 20 లీటర్ల సారా తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో పట్టుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు తెలిపారు.

మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభం

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ప్రారంభమైంది. వెనకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కుట్టు శిక్షణను ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి దాట్ల కృష్ణవర్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, స్థానిక నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



తునిలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే యనమల దివ్య సూచించారు. పట్టణంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళాభ్యుదయానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మున్సిపల్ చైర్మన్ నార్ల భువనసుందరి, యనమల రాజేష్, సుర్ల లోవరాజు, కుశమంచి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక పార్కుకు శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు

జగ్గంపేట/గండేపల్లి: ప్రతి నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అన్నారు. జగ్గంపేట డిగ్రీ కాలేజీ సమీపంలో రూ.10 కోట్లతో నిర్మించే జగ్గంపేట నియోజకవర్గ పారిశ్రామిక పార్కుకు శనివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఎఫ్‌ఎఫ్‌సీ పార్కులు ఏర్పాటు చేయడంతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు వీలు కలుగుతుందని చెప్పారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ జగ్గంపేటలో ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక పార్కు రాష్ట్రానికే ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దుతామన్నారు. యువత, చిన్న పరిశ్రమలు నడిపేవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గండేపల్లి ఎంఎస్ భవనంలో ఉచిత కుట్టు శిక్షణను వారు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఐఐసీ జిల్లా జెడ్‌ఎం ఎ.రమణారెడ్డి, డీజెడ్‌ఎం పద్మజాదేవి, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, సర్పంచులు కందుల చిట్టిబాబు, సీలామంతుల వీరబాబు, అడబాల ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ పోతుల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయం వద్ద అన్నదానం

కోటనందూరు: స్థానిక చిన్నరామాలయం వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. స్థానిక ముస్లిం మైనారిటీ మస్జిత్ ఏ రసూల్ అధ్యక్షుడు షేక్ మీరాబాయి ఆర్థిక సహాయంతో ఈ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసులకు హెల్మెట్ల పంపిణీ



ప్రత్తిపాడులో పోలీస్ సిబ్బందికి హెల్మెట్లు అందజేస్తున్న శ్రీను, తదితరులు

ప్రత్తిపాడు: స్థానిక ఏగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శనివారం పోలీసులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. అమ్మవారి జాతర మూడు రోజుల పాటు వైభవంగా జరగడంలో పోలీసుల సేవలను ఆలయ కమిటీ ప్రశంసించింది. ఆలయ కమిటీ సభ్యులు గోపిశెట్టి శ్రీను, అంబటి వల్లభరావు (బుజ్జి) తదితరులు పోలీసు సిబ్బందికి హెల్మెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఎస్. లక్ష్మీకాంతం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల కొండలరావు (నాని), భవన నిర్మాణ కార్మికుల సంఘ నాయకుడు పత్రి రమణ, పి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంచెక్కని కళ !

- చెక్కతో సత్యదేవుని రథాల తయారీ
- శిల్పులు కొల్లాటి కామేశ్వరరావు, శ్రీనివాస్ బృందానికి అభినందనల వెల్లువ

అన్నవరం: శిల్పకళను తలదన్నేలా చెక్కపై అందమైన చిత్రాలు, దేవతామూర్తులు, దేవుళ్ల రూపాలతో పాటు దేవతా మూర్తులను ఊరేగించే ఎత్తయిన రథాలను రూపొందించే శిల్పులు ఉన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురముళ్లకు చెందిన మాణిక్యాంబ శిల్పకళా వుడ్ వర్క్స్ అధినేతలు కొల్లాటి కామేశ్వరరావు, కొల్లాటి శ్రీనివాస్ ఆ కోవకు చెందిన వారే. పది అడుగుల ఎత్తు కలిగిన చిన్న రథంతో బాటు 36 అడుగుల ఎత్తయిన రథాలు నిర్మించిన చరిత్ర వారిది. వీటితో పాటు ఇంకా దేవతామూర్తుల విగ్రహాలు, వస్తువులు, కళాఖండాలను తయారు చేసి అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు.

ఇప్పటి వరకు 82 రథాలు

ఇప్పటి వరకు 82 రథాలు తయారు చేసినట్టు కొల్లాటి శ్రీనివాస్ తెలిపారు. వాటిలో 43 అడుగుల ఎత్తు కలిగిన అంతర్వేది దేవస్థానం రథం పెద్దది. యానాంలోని మీసాల వేంకటేశ్వరస్వామి దేవస్థానం రథం ఎత్తు 38 అడుగులు. అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామివారికి సుమారు 1.40 కోట్లతో 14 అడుగుల ఎత్తు కలిగిన చిన్నరథం, 34 అడుగుల ఎత్తు కలిగిన పెద్ద రథం తయారు చేశామన్నారు. ఇవి కాకుండా పలు ప్రముఖ దేవస్థానాలకు రథాలు, లోవకొత్తూరులో నూతనంగా నిర్మించిన తలుపులమ్మ తల్లి ఆలయం తలుపులు కూడా తామే తయారు చేశామని తెలిపారు.

సత్యదేవుని చిన్నరథం

నిర్మాణ వ్యయం రూ.34 లక్షలు. ఎత్తు 14 అడుగులు. వెడల్పు 6.3 అడుగులు. పొడవు 7.5 అడుగులు. గతేడాది మార్చి 2న, రథసప్తమి నాడు ఈ రథాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రతి ఆదివారం రత్నగిరి ఆలయ ప్రాకారంలో స్వామి, అమ్మవారిని ఊరేగిస్తున్నారు.

పెద్ద రథం

నిర్మాణ వ్యయం రూ.1.08 కోట్లు. ఎత్తు 34 అడుగులు. వెడల్పు 14 అడుగులు. పొడవు 23.5 అడుగులు. సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల ఐదో రోజు అన్నవర పుర వీధుల్లో ఘనంగా ఊరేగిస్తున్నారు. కాగా రథాలు చెక్కిన శిల్పి కొల్లాటి కామేశ్వరరావును దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, పూర్వపు ఈఓ, ప్రస్తుత దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఘనంగా సన్మానించారు.



కొల్లాటి కామేశ్వరరావు, శ్రీనివాస్ బృందం తయారు చేసిన సత్యదేవుని రథం

సంక్షిప్తంగా..

వైభవంగా వెంకన్న తెప్పోత్సవం



ప్రత్యేక అలంకారంలో తంటికొండ వేంకటేశ్వరస్వామి

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి,అమ్మవార్లను గజవాహనంపై ఊరేగించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సుదర్శన హోమం, గజవాహన సేవ, సహస్ర దీపాలంకర సేవ, తెప్పోత్సవం, ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. వేదపండితులతో పండిత సదస్యం నిర్వహించారు. గోవిందమాలధారణ భక్తులు, భక్తులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

నేడు గరుడ వాహన సేవ

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీలక్ష్మీ నారసింహ హోమం, గరుడ వాహన సేవ, మృగయోత్సవం, దొంగల దోపోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

తంటికొండ వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

గోకవరం: మండలంలోని తంటికొండలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఉదయం అర్చకులు స్వామి వారికి నిత్యోపాసన, బలిహరణ, విశేషార్చనలు నిర్వహించారు. కళ్యాణోత్సవాలను పురస్కరించుకుని స్వామిని పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం పల్లకీసేవ నిర్వహించి పంచహారతులు ఇచ్చారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

ప్రత్తిపాడు: సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెలా పేద విద్యార్థులకు పోషకాహార కిట్లు అందజేస్తున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, శ్రీషిర్డీ సాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక బజారు వీధి రామాలయ ఆవరణలో శనివారం సదా మీ సేవలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ సభ్యులు భేరి రాంబాబు, జాజిమొగ్గల జగదీశ్వరి, ఎస్.లోవకుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు బీసీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి శనివారం మంటలు చెలరేగాయి. సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో సుమారు 15 రోజుల క్రితం విద్యుత్ సప్లయిను డైరెక్ట్ చేశారు. దీంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వస్తున్నాయి. రెండు వారాలైనా ట్రాన్స్‌ఫార్మర్ మార్చకపోవడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.